సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 1 । మార్చి । 2023



ఘాటెక్కిన మిర్చి ధర !

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఈ సీజన్‌లోనే అత్యధికంగా మిర్చి క్వింటాకు రూ.21,625గా ధర పలికింది. 8లో



2,037మందికి కొలువులు

కొత్తగూడెంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో వివిధ కంపెనీల బాధ్యులు పాల్గొని 2,037 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 19°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత ఎక్కువగానే నమోదవుతోంది. ఉదయం నుంచే చాలా ప్రాంతాల్లో ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి అర్చలకు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

మొక్కలను సంరక్షించాలి



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

ములకలపల్లి : వేసవి సమీపిస్తున్న తరుణంలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని సీతారాంపురం, పూసుగూడెం, వీకే.రామవరం పంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లక్షల రూపాయలు వెచ్చించి నాటిన మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.చిన్ననాగేశ్వరరావు, ఎంపీఓ లక్ష్మయ్య, సర్పంచ్‌లు సున్నం సుశీల, విజయ, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేయూసీఈకి మహర్దశ

రూ.75 కోట్లతో ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి ప్రతిపాదనలు

- కొత్తగా అకడమిక్ బ్లాక్‌లు, హాస్టళ్ల నిర్మాణం
- కాలేజీ స్థలం కబ్జా కాకుండా ప్రహరీ
- పాత భవనాలకు మరమ్మతులు
- ప్రభుత్వానికి నిపుణుల కమిటీ నివేదిక



కళాశాలలో శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనం



కేయూసీఈ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కేయూసీఈ)లో అభివృద్ధి పనులకు రూ.75 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కొత్తగూడెం - పాల్వంచ మధ్యలో నిర్మించిన జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)ని జనవరి 12న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కేయూసీఈ) అభివృద్ధి కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు గత నెల 4న ప్రొఫెసర్ గోపాల్ నాయక్ (సివిల్ ఇంజనీరింగ్, ఓయూ), ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి (మెకానికల్, జేఎన్టీయూ), పి.రామయ్య (కేయూ)లతో నిపుణుల కమిటీని నియమించారు. ఫిబ్రవరి 9న ఈ కమిటీ కేయూసీఈ (కేఎస్ఎం) క్యాంపస్‌లో పర్యటించింది. అనంతరం ప్రస్తుత అవసరాలు, భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా కాలేజీని తీర్చిదిద్దేందుకు వీలుగా రూ.75 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ప్రతిపాదనలిలా..

రూ.7.50 కోట్ల వ్యయంతో 2వేల చదరపు మీటర్ల వైశాల్యంతో ఫర్నిచర్‌తో కూడిన నూతన అకడమిక్ భవన నిర్మాణం చేపట్టాలని కమిటీ సభ్యులు ప్రతిపాదించారు. రూ.1.70 కోట్ల వ్యయంతో ప్రస్తుతం ఉన్న అకడమిక్ బ్లాక్ 2లో 430 చదరపు మీటర్ల వైశాల్యంతో పై అంతస్తు నిర్మించాలని సూచించారు. రూ. 80 లక్షల వ్యయంతో ప్రస్తుతం ఉన్న బాలుర, బాలికల హాస్టళ్లను మరమ్మతు చేయాలని, ఒక్కో విభాగానికి రూ.కోటి చొప్పున ఐదు విభాగాలకు రూ.5 కోట్ల వ్యయంతో ల్యాబొరేటరీ పరికరాలు కొనుగోలు చేయాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. రూ.5 కోట్లతో 300 చదరపు మీటర్ల వైశాల్యంతో నాలుగు వర్క్‌షాప్ షెడ్లు నిర్మించాలని, రూ.10 కోట్ల వ్యయంతో 500 మంది సామర్థ్యంతో బాలుర హాస్టల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. మరో రూ.7 కోట్లతో 300 మంది బాలికలు ఉండేందుకు అనువుగా హాస్టల్ నిర్మించాలని పేర్కొన్నారు. రూ.3 కోట్ల వ్యయంతో ల్యాబొరేటరీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రూ.10 కోట్లతో కాలేజ్ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనల్లో పొందుపర్చారు. రూ. 6 కోట్లతో అకడమిక్ బ్లాక్ విస్తరణ చేపట్టాలని సూచించారు. కాగా, రెండో దశలో రూ.10 కోట్లతో బాలుర హాస్టల్ భవనం విస్తరణ, రూ.7 కోట్లతో బాలికల హాస్ట్ భవనం విస్తరణ, తదితర పనులు చేపట్టాలని ప్రతిపాదనల్లో సూచించారు.

తొలి దశలో రూ.51 కోట్లతో..

ఇంజనీరింగ్ కళాశాలలో భవిష్యత్‌లో ప్రారంభించబోయే కోర్సుల ఆధారంగా మొత్తం రూ.75 కోట్లతో వివిధ పనులకు నిపుణుల కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇందులో రూ. 51.31 కోట్లతో కొన్ని పనులు అత్యవసరంగా చేపట్టాలని సూచనలు చేసింది. ఆ పనుల వివరాలిలా..

పని	సామర్థ్యం	అంచనా వ్యయం (కోట్లలో)
బాలుర హాస్టల్	500	రూ. 21.50
బాలికల హాస్టల్	300	రూ. 14.60
వర్క్‌షాప్ షెడ్లు	4	రూ. 5.21
అకడమిక్ బ్లాక్	జీ ప్లస్ 1	రూ. 7.40
ఓల్డ్ అకడమిక్ విస్తరణ	---	రూ.1.60
ఏబీసీటీ బ్లాక్	జీ ప్లస్ వన్	రూ. 0.50
టాయిలెట్ల మరమ్మతులు, నిర్వహణకు	---	రూ. 0.50

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1957లో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ (హైదరాబాద్)లో మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత మైనింగ్ విభాగాన్ని 1976లో సింగరేణి బొగ్గు గనులు ఉన్న కొత్తగూడేనికి తరలించారు. ఓయూ పరిధిలో కొనసాగుతున్న ఈ కాలేజీని అప్పట్లో కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌గా పిలిచేవారు. 1994లో ఓయూ నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి మారింది. ప్రస్తుతం ఈ కాలేజీలో గ్రాడ్యుయేషన్ విభాగంలో మైనింగ్, ఈఈఈ, కంప్యూటర్ సైన్స్ విభాగాలతో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కింద ఈసీఈ, ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిసి 250 సీట్లు ఉన్నాయి. వీటితో పాటు 2001 నుంచి ఎంబీఏ, ఎంసీఏ వంటి పీజీ కోర్సులు కూడా ఈ కాలేజీలో అందుబాటులోకి తెచ్చారు. ఈ కళాశాల సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉంది.

నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు

- పోలీస్, న్యాయశాఖ సమన్వయంతో పని చేయాలి
- జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ పిలుపు



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్

కొత్తగూడెంటౌన్: పోలీసు, న్యాయ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో మంగళవారం ఇరు శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. రెండు శాఖల సిబ్బంది కలిసి పని చేస్తూ ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. క్రిమినల్ కేసుల వివరాలు, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టే విధానం తదితర అంశాలపై స్టేషన్లవారీగా అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ.. నేరస్తులపై నిరంతర నిఘా పెట్టి వారికి శిక్ష పడేలా చూడాలని కోరారు. పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలిస్తూ, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.శ్యామ్‌శ్రీ, జి.భానుమతి, అడెపు నీరజ, బత్తుల రామారావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కృష్ణమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పీవీడీ లక్ష్మీ, మీర్జా, ఫిరోజ్, న్యాయవాదులు వి.పురుషోత్తమరావు, పి.నిరంజన్‌రావు, జ్యోతి, విశ్వకర్మ, జి.నాగస్రవంతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.జానయ్య, ఏఎస్పీ పంకజ్ పరితోష్, డీఎస్పీలు నందీరామ్, రెహమాన్, వెంకటేష్, రమణమూర్తి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి

కలెక్టర్ అనుదీప్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ మహిళా, శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్షయ తృతీయ సందర్భంగా బాల్యవివాహాలు జరిగే ఆస్కారం ఉందని, నియంత్రణపై దృష్టి పెట్టాలని చెప్పారు. సీడీపీఓలు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహించి వీధి బాలలను గుర్తించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి లెనీనా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూయ, బీసీ సంక్షేమాధికారి సురేందర్, హరికుమారి పాల్గొన్నారు.

పోషణ లోప రహిత జిల్లాగా మార్చాలి..

తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపంతో బాధ పడుతున్న చిన్నారులను సాధారణ స్థితికి తేవాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని కలెక్టర్ అన్నారు. మంగళవారం మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాద్రిని పోషణ లోప రహిత జిల్లాగా ప్రకటించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లాలో 11 అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 71,077 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. పోషణ లోపాన్ని అధిగమించేందుకు జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలోని 1058 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని వివరించారు.

వైద్యసేవలు అందుబాటులో ఉండాలి

ఆపత్కాలంలో ఏ క్షణమైనా వైద్యసేవలు అందించడానికి సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. వైద్యసేవల నిర్వహణపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేట, చర్ల, బూర్గంపాడు, ఇల్లెందు, రామవరం, మణుగూరు, భద్రాచలం, పాల్వంచ ఆస్పత్రుల్లో రూ. 11.08 కోట్లతో సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కొత్తగూడెంలో నిర్మించిన సీటీ స్కాన్, రేడియాలజీ ల్యాబ్‌లను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని చెప్పారు. రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ శిరీష, ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులు కుమారస్వామి, ఆసుపత్రుల సమన్వయ అధికారి రవిబాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి 'సువర్ణ' వాహనాలు

- రామాలయానికి ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ వితరణ
- రూ.75 లక్షల వ్యయంతో తమిళనాడులో తయారీ
- 2, 3వ తేదీల్లో వాహనాల ప్రతిష్ఠ మహోత్సవం
- 4న తిరువీధి, సార్వభౌమ వాహన సేవలు



గరుడ వాహనం



హంస వాహనం



శేష వాహనం



గజ వాహనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఖజానాకు నూతన సువర్ణ ద్వాదశ వాహనాలు చేరాయి. ఈ వాహనాల తయారీకి ప్రవాసాంధ్ర ఆర్యవైశ్య అసోసియేషన్ రూ.75 లక్షల ఆర్థిక సాయం అందించింది. దీంతో దేవస్థాన వైదిక కమిటీ సలహాలు, సూచనల మేరకు తమిళనాడులోని కుంభకోణంలో నిష్ణాతులైన కళాకారులచే వాహనాలను తయారు చేయించారు. ఇందులో సార్వభౌమ, హనుమంత, కల్పవృక్ష, సింహాసన, హంస, సింహ, గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష వాహనాలు ఉన్నాయి. శ్రీ రామదాసు కాలంలో తయారు చేయించిన వాహనాలతోనే ఇప్పటివరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి వారికి వాహన సేవలు అందుతున్నాయి. తిరువీధి సేవలతో పాటు ప్రధాన ఉత్సవాలైన శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి వేడుకల్లో స్వామివార్ల వాహనసేవలు ఉంటాయి. ఈ క్రమంలో నూతనంగా తయారు చేయించిన సువర్ణ ద్వాదశ వాహనాలతో ఇక నుంచి స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవలు కొనసాగనున్నాయి.

రేపటి నుంచి ప్రతిష్ఠ..

సువర్ణ ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠా మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్, దేవస్థానం వారు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో గురువారం అంకురార్పణ, శుక్రవారం ఉదయం 7.29 గంటలకు సువర్ణ ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠ, సాయంత్రం 4.30 గంటలకు నూతన 12 సువర్ణ వాహనాలతో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తారు. 4వ తేదీ శనివారం సాయంత్రం 6.30 గంటలకు సార్వభౌమ వాహన సేవలను జరపాలని నిర్ణయించారు.

ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ..

రూ. 75 లక్షల విరాళాలతో శ్రీరామచంద్ర స్వామికి తయారు చేయించిన నూతన సువర్ణ ద్వాదశ దివ్య వాహన ప్రతిష్ఠా మహోత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ బాధ్యులు కోరారు. జీయర్ మఠంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భక్తి ప్రపత్తులతో ఎన్ఆర్ఐ ఆర్యవైశ్యులు సమర్పించిన ఈ వాహనాలను స్వామి వారికి అంకితం చేసే కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, దుర్గాప్రసాద్, రామారావు, చారుగుళ్ల శ్రీనివాస్, జి. వెంకటాచార్యులు, కృష్ణయ్య, వై.సూర్యనారాయణ, అల్లం నాగేశ్వరరావు, పొడిచేటి సీతారామానుజాచార్యులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ వాహనాలకు ఘన స్వాగతం..

కాగా తమిళనాడు నుంచి ఈ వాహనాలు లారీలో మంగళవారం సాయంత్రం భద్రాచలం చేరుకున్నాయి. వీటికి బ్రిడ్జి సెంటర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు హారతితో స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

సుజాతనగర్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి అన్నారు. బీజేపీ స్ట్రీట్ కార్నర్ సభ మంగళవారం రాత్రి సుజాతనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ దేశ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశ విధానాలతో బలహీన వర్గాల వారిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అకుల నాగేశ్వరరావు గౌడ్, నాయకులు భూక్యా రాజేష్, ఖాసీం, వినీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ఘనమైన పూజలు



అమ్మవారికి జ్యోతి పూజ నిర్వహిస్తున్న భక్తులు

అశ్వారావుపేట మండలం వేదాంతపురం అటవీ ప్రాంతంలో పురాతన కాలం నాటి శ్రీ గంగానమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం రాత్రి చండీయాగం నిర్వహించారు. వేద పండితుల సమక్షాన భక్తిశ్రద్ధలతో చండీయాగం చేయగా, అశ్వారావుపేట, దమ్మపేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కాగా, యాగం, ప్రత్యేక పూజలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

– అశ్వారావుపేటరూరల్

పోలీస్ శాఖలో 'ఏఆర్' కీలకం : ఎస్పీ వినీత్

కొత్తగూడెంరూరల్: పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర కీలకమని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం జరిగిన డీ-మొబిలైజేషన్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయుధ దళ విభాగంలో జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల విధులు నిర్వర్తించే ఏఆర్ అధికారులు, సిబ్బందికి గత 15 రోజులుగా మొబిలైజేషన్లో భాగంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఏఆర్ విభాగం పాత్ర కీలకమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పరోక్షంగా, ప్రత్యక్షంగా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం జిల్లా సాయుధ విభా గంలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అంతకుముందు సాయుధ బలగాల విభాగం తరపున పరేడ్ కమాండర్ ఆర్ఐ దామోదర్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీ

కొత్తగూడెంటౌన్ : జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల 1న నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని ఆయన కోరారు. నేడు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 08744–243666 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

'సంక్షేమం'లో రాష్ట్రం ప్రథమం

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

గుండాల: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం ఆయన గుండాల మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో నిరుపేదల సొంతింటి కల నిజం చేయడమే కేసీఆర్ ధ్యేయమని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. దేశంలోని 20 ఆదర్శ గ్రామాలను కేంద్రం గుర్తిస్తే అందులో 19 తెలంగాణవే కావడం విశేషమని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్‌కు అదే నిదర్శనమని అన్నారు. అన్ని గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కోట్ల నిధులతో రహదారులు, బ్రిడ్జీలు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య తదితర రంగాల్లో అభివృద్ధి సాధించాయని వివరించారు. రూ.50 లక్షలతో తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణ పనులకు, రూ. 50 లక్షల వ్యయంతో సాయనపల్లి, జగ్గాయిగూడెం, ముత్తాపురం, కాచనపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు, దామరతోగు నుంచి ఎస్సీ కాలనీకి రూ. 80 లక్షలతో రోడ్డు, ముత్తాపురం-దొంగతోగు మధ్య కిన్నెరసానిపై రూ. 8.50 కోట్లతో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. యాపలగడ్డ సమీపంలో ఇటీవల రూ. 2 కోట్లతో నిర్మించిన 40 డబుల్ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముక్తి సత్యం, సర్పంచ్‌లు కోరం సీతారాములు, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, డీఈ వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ సైదుల్‌రెడ్డి, ఐటీడీఏ ఏఈలు మోతీలాల్, మహేష్, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉప ప్రధానార్చకుడి ఉద్యోగ విరమణ



సత్యనారాయణాచార్యుల కుటుంబంతో ఆలయ అర్చకులు, పండితులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఉప ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న పొడిచేటి సత్యనారాయణాచార్యులు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. అంతరాలయంలో మూలమూర్తుల దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేసి ఆలయంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సత్యనారాయణాచార్యుల కుటుంబ సభ్యులు, ప్రధాన అర్చకులు, ఇతర ముఖ్య అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే పీఆర్‌సీ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగుల 2022 పీఆర్‌సీని వెంటనే విడుదల చేయాలని తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ఉద్యోగులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత11 నెలలుగా పీఆర్‌సీ పెండింగ్‌లో ఉందని, దీంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1999 – 2002 బ్యాచ్ ఉద్యోగుల ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మంగీలాల్, సుధీర్, మజీద్, మహేశ్, సీతారాంరెడ్డి, రాధాకృష్ణ, నరసింహారావు, నాగేశ్వరరావు, రవీందర్, కోటేశ్వరరావు, ప్రభాకర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జేవీవీ ప్రతినిధులు

బూర్గంపాడు: శాస్త్రీయ దృక్పథంతో జీవన విధానాలను అనుసరిస్తు ముందుకు సాగాలని జనవిజ్ఞాన వేదిక సీనియర్ ప్రతినిధి మండవ సుబ్బారావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో బూర్గంపాడు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సెమినార్ నిర్వహించారు. నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కస్తూరి ప్రారంభించారు. మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాల వలన జరిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు రమేశ్ కుమార్ మక్కడ్, కామేశ్వరరావు, వీరస్వామి, శిరీష, జీనత్, సుధా, వినోద్, ఆశాలత, షంషబేగం, రాము, సారయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంటలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు.

ఐదుగురిపై వేధింపుల కేసు

జూలూరుపాడు: వివాహితను వేధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్న భర్త, అత్తమామ, బావలపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని దండుమిట్ట తండాకు చెందిన సుజాతకు సుజాతనగర్ మండలం బేతంపూడికి చెందిన బానోత్ రమేష్‌తో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లు సుజాత– రమేష్ బాగానే ఉండగా, ఆరు నెలల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఆమెను భర్తతో పాటు అత్తామామలు, బావలు వేధిస్తుండగా, తప్పించుకొని పుట్టింటికి చేరింది. అయినప్పటికీ అత్తింటివారి వేధింపులు ఆగకపోవడంతో సుజాత చేసిన ఫిర్యాదుతో ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఘాటెక్కిన మిర్చి ధర !

- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.21,625
- సాగు విస్తీర్ణం, దిగుబడి తగ్గడంతో పంటకు డిమాండ్
- సీజన్‌లో రికార్డు ధరగా వెల్లడించిన మార్కెట్ వర్గాలు





ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి, (ఇన్‌సెట్) రైతు రాంబాబును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ శ్వేత, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర ఘాటెక్కింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం తేజా రకం మిర్చి జెండాపాట ధర రూ.21,625గా పలికి రికార్డు సృష్టించింది. సోమవారం రూ.20,200 ఉన్న ధర ఒకే రోజులో రూ.1,425 పెరగగా.. ప్రస్తుత సీజన్‌తో పాటు పంట సీజన్లలో దేశంలోనే ఈ ధర అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గటం, తెగుళ్ల కారణంగా ఆశించిన దిగుబడి లేకపోవడంతో పంటకు డిమాండ్ పెరుగుతోందని తెలుస్తోంది. ఖమ్మం మార్కెట్‌కు మంగళవారం 41,141 బస్తాల తేజా రకం మిర్చిని విక్రయానికి తీసుకురాగా.. వ్యాపారులు పోటీపడ్డారు. జెండాపాటలో వైరా మండలం పినపాకకు చెందిన రైతు ఎం.రాంబాబు తదితరులు తీసుకువచ్చిన మిర్చి క్వింటాకు రూ.21,625 ధర పలికింది. దీంతో రైతులను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం సత్కరించారు. కాగా, మోడల్ ధర రూ.20 వేలుగా, కనిష్ట ధర రూ.14 వేలుగా నమోదైందని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నిన్నమొన్నటి వరకు రూ.10 వేలు పలికిన తాలు మిర్చి ధర మంగళవారం రూ.12 వేలకు చేరింది.

ఎర్ర బంగారమే..

పంటల్లో మిర్చిని ఎర్ర బంగారంగా పిలుస్తుండగా.. ప్రస్తుత ధరను చూస్తుంటే అది నిజమేనని చెప్పాల్సి వస్తోంది. ఇతర రకాలతో పోలిస్తే ఘాటు ఎక్కువగా ఉండడం, విదేశాల్లో డిమాండ్ ఉన్న తేజా రకం మిర్చిని వ్యాపారులు చైనా, మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ రకం మిర్చిసాగుకు ఖమ్మంతో పాటు వరంగల్, నల్లగొండ, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నేలలు అనుకూలంగా కావడంతో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాల రైతులు ఈ రకం మిర్చిని అధికంగా సాగు చేస్తుంటారు.

సాగు, దిగుబడి లేకనే డిమాండ్

తేజా రకం మిర్చి దిగుబడి ఆశించనంతగా లేకపోవటంతో డిమాండ్ పెరుగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా గత ఏడాది రైతులు మిర్చి సాగు చేయగా తామరపురుగు(నల్లి) ఆశించడంతో నష్టపోయారు. దీంతో ఈసారి సాగు తగ్గింది. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా, ఈ ఏడాది లక్ష ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అయితే, ఈసారి కూడా తామర పురుగు ఆశించడంతో దిగుబడి పడిపోగా, పంటకు డిమాండ్ పెరిగింది.

ప్రస్తుత సీజన్‌లో ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర (క్వింటాకు రూ.ల్లో)

తేదీ	ధర		
		ఫిబ్రవరి 1	18,200
జనవరి 5	21,050	8	18,050
11	21,000	21	18,500
12	20,000	22	19,100
20	19,800	24	20,800
27	19,100	27	20,200
30	18,700	28	21,625

ఆశాజనకంగా ధర



మిర్చి ధర ఆశాజనకంగా ఉంది. ఎకరంన్నరలో సాగు చేయగా ఇప్పటికే మూడు సార్లు విక్రయించా. మొదటిసారి క్వింటాకు రూ.18,800, రెండోసారి రూ.17,600 వచ్చింది. ప్రస్తుతం 21 బస్తాలు తీసుకొస్తే రూ.20వేల వరకు ధర వస్తుందని భావించగా.. రూ.20,500 ధర పడింది.–మోరం నారాయణ, మాణిక్యారం, ఇల్లెందు మండలం

ధర బాగున్నా దిగుబడి లేదు...



మిర్చికి ఆశించిన ధర కంటే అధికంగానే లభించింది. రెండెకరాల్లో సాగు చేయగా తామర పురుగు ఆశించి దిగుబడి పడిపోయింది. ఏడు బస్తాల మిర్చి తీసుకొస్తే రూ.20 వేల ధర పెట్టారు. దిగుబడి మంచిగా ఉంటే ఈ ధరతో పెట్టుబడి అప్పులు తీరడంతో పాటు లాభాలూ వచ్చేవి.– ఈసాల రాంబాబు, చంద్రశ్లగూడెం, కారేపల్లి మండలం

‘కొమరారాం’ కోసం ఆందోళనలు

- మండలంగా ప్రకటించే వరకు ఉద్యమిస్తాం : గుమ్మడి
- జాప్యం.. రాజకీయ కుట్రే : ఆవునూరి



పాదయాత్ర చేస్తున్న గుమ్మడి నర్సయ్య తదితరులు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: కొమరారంను మండలంగా, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య స్పష్టం చేశారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో కొమరారంలో 27 రోజులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించి, 28వ రోజైన మంగళవారం అక్కడి నుంచి ఇల్లెందుకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష, అవకాశాలు ఉన్నప్పటికి మండల కేంద్రంగా ప్రకటించడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మంత్రి సత్యవతి రాథోడ్, స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వం ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు నాయిని రాజు, ఆజ్మీర బిచ్చా, యాకూబ్ షావలి, బుర్ర వెంకన్న, మోడెం రాంబాబు, రాఘవులు, బండారు సత్యం, సావిత్రి, కిరణ్, కాంపాటి ప్రసాద్, శాంతారావు, జాన్‌బాబు పాల్గొన్నారు.

అధికార పార్టీ గెలవదనే..

కొమరారం, బోడు కొత్త మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై అధికార పార్టీ రాజకీయ కుట్రతోనే జాప్యం జరుగుతోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొమరారం, బోడులో అధికార పార్టీ గెలువదనే ఉద్దేశంతోనే కొత్త మండలాల ప్రకటనను పక్కన పెట్టారని విమర్శించారు. ఆయా గ్రామాల్లో మండలాల ఏర్పాటుకు అనువుగా పలు కార్యాలయాలు కూడా ఉన్నాయని తెలిపారు. కొత్త మండలాల ఏర్పాటు కోసం మార్చి 4 నుంచి ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. మర్రిగూడెం నుంచి పాదయాత్రలు ప్రారంభించి 7న కొమరారంలో బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. ఈ బహిరంగ సభకు అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు కోదండరాం, భట్టి విక్రమార్క, సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, జె.సీతారామయ్య, ముద్రగడ వంశీతో పాటు ఎన్డీ నేతలు హాజరవుతారని వివరించారు. సమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, కె. సారంగపాణి, పొడుగు నర్సింహారావు, మోతీలాల్, మాలూ, జోగ కృష్ణ, ధర్మా, లక్ష్మా, సర్పంచ్‌లు సంతు, శ్రీను పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

చంద్రుగొండ : ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధరణి సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా హామీకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆరోపించారు. రైతుల వ్యవసాయ రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని కోరారు. గిరిజన, గిరిజనేతర పేదలందరికీ పోడుపట్టాలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట నాయకులు గార్లపాటి రామనాథం, మండల కార్యదర్శి బొర్రా కేశవులు, జడ శ్రీను తదితరులు ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్..



సుజ్ఞానపురంలో బెల్లం ఊట డ్రమ్ములను ధ్వంసం చేసిన అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం, ములకనాపల్లి గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. గత 22వ తేదీన సాక్షిలో ప్రచురితమైన ‘మార్పు వచ్చేది ఎన్నడు’ కథనానికి స్పందించిన ఎక్సైజ్ అధికారులు ఈ చర్యలు చేపట్టి సుజ్ఞానపురంలో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ములకనాపల్లిలో నాటుసారా విక్రయిదారుడిపై కేసు నమోదు చేసి, అతని నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ములకనాపల్లికి చెందిన నలుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ తిరుపతిరావు, సీఐ ముబషిర్, డీటీఎఫ్ ఏఈఎస్ కరణ్‌చంద్, సిఐలు రాజిరెడ్డి, రహిమున్నీసా బేగం, ఎస్ఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోండి



రైతులు, ఉద్యోగులతో డీఏఏ అభిమన్యుడు

టేకులపల్లి: జిల్లావ్యాప్తంగా సాగైన పంటల వివరాలను నమోదు చేయిస్తున్న నేపథ్యాన రైతులు తమ వివరాలు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కొర్స అభిమన్యుడు సూచించారు. మండలంలోని వజ్జోనిగూడెంలో పంటల వివరాల నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వారానికి రెండు గ్రామాల్లో 40 మంది రైతుల పంటలను పరిశీలించి క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఏదైనా నష్టం జరిగినా, ఇతర సమయాల్లో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓలు బి.సాయినారాయణ, నీరుడు అన్నపూర్ణ, ఏఈఓ ఎస్.కే.రెహానా పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

భద్రాచలంఅర్బన్: జిల్లా పరిశ్రమల కేంద్రంల ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏలోని గిరిజన భవన్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎంఈజీపీ, పీఎం ఎఫ్‌ఎం ఈ, టీ–ఐడీఈఏ, టీ-పీఆర్‌ఐడీఈ, టీఎస్ఐ పాస్ పథకాలు, విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం టి.సీతారాం, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీరామ్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్, బి.తాతారావు, బి.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

నిరాశ్రయురాలైన వృద్ధురాలు



గుడిసె కాలిపోవడంతో వీధిన పడిన సుశీలమ్మ

అశ్వాపురం: అశ్వాపురం మండల పరిధిలోని తుమ్మలచెరువు పంచాయతీ రామవరంలో సోమవారం రాత్రి పూరిల్లు దగ్ధం కాగా, 70 ఏళ్ల వృద్ధురాలు గుల్ల సుశీలమ్మ నిరాశ్రయురాలైంది. ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని పూరిల్లు కాలిపోతుండగా స్థానికులు గమనించి మంటలు ఆర్పి వృద్ధురాలిని రక్షించారు. సుశీలమ్మ కుమారుడు, కూతురుకు వివాహాలు కావడంతో వారు వేరుగా నివాసం ఉంటున్నారు. పూరింట్లో ఒక్కతే ఉంటోంది. గుడిసె కాలిపోవడంతో వీధిన పడ్డానని, ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని ఆమె కోరుతోంది.

నిత్యావసర వస్తువుల వితరణ

నిరాశ్రయురాలైన సుశీలమ్మకు అఖిల భారత మానవ హక్కుల సంఘం, ధరణి ఫౌండేషన్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం నరేందర్‌బాబు, కార్యదర్శి సాధనపల్లి సతీష్, ఆర్గనైజేషన్ సెక్రటరీ కుమ్మరి రమేష్, ధర్మారావు, పెద్దిరెడ్డి రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, రాము, చంటి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

భద్రాచలంటౌన్: విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బొల్లా రాజు తెలిపారు. భద్రాచలంలోని గిరిజన ఉపాధ్యాయ విద్యా కళాశాలలో మంగళవారం జరిగిన కెరీర్ గైడెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచం గ్లోబల్ విలేజ్‌గా మారిన నేపథ్యాన ఉపాధ్యాయ అభ్యర్థులు నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరముందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, అధ్యాపకులు కోదండరాం, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడిసె తొలగింపుపై ఫిర్యాదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీకి చెందిన సీతమ్మ స్థలంలో ఉన్న గుడిసెను ఓ వ్యక్తి సోమవారం తొలగించగా ఘర్షణ చోటు చేసుకుంది. సదరు వ్యక్తి తనను అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడని సీతమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

కిరాయి పేరుతో కార్ల తాకట్టు

ఖలీల్‌వాడి: నెలవారీ అద్దె పేరిట అగ్రిమెంట్ చేసుకుని కార్లను తాకట్టు పెట్టిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. నిజామాబాద్ కోటగల్లికి చెందిన రాజేష్ దాదాపు 25కార్లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులకు అద్దెకు ఇస్తానని చెప్పి యజమానులతో అగ్రిమెంట్ చేసుకున్నాడు. అయితే ఈ కార్లను తీసుకెళ్లిన రాజేష్ భద్రాద్రి జిల్లాలో కొందరు ఉద్యోగులు, యువకులకు తాకట్టు పెట్టి రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు తీసుకున్నట్లు తెలిసింది. ఆతర్వాత ఒక కారు యజమాని అద్దె విషయమై అడుగుతున్నా స్పందన లేకపోవడంతోమూడో టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు జీపీఎస్ సాయంతో కారు కొత్తగూడెంలో ఉన్నట్లు గుర్తించి అక్కడకు వెళ్లి కారుతో పాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అలాగే, రాజేష్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

101 శాతం బొగ్గు ఉత్పత్తి



జీఎం జక్కం రమేష్

కొత్తగూడెంటౌన్: ఫిబ్రవరి నెలలో సింగరేణి కొత్తగూడెం ఏరియా 13.22 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 101 శాతంతో నిలిచిందని జీఎం జక్కం రమేష్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 126.17 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికిగాను 91 శాతంతో 114.76 లక్షల టన్నులు సాధించామని చెప్పారు. సమావేశంలో ఏజెంట్ బూర రవీందర్, డీజీఎంలు సామ్యూల్ సుధాకర్, రాజశేఖర్, యోహాన్, ఏరియా వర్క్‌షాపు ఈఈ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ పీఓ జి.సుధాకర్, ఎస్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సాగర్, కమ్యూనికేషన్ కో–ఆర్డినేటర్ కె. శ్రీనివాస్‌రెడ్డి, రమాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై కందకాలు తవ్విన మావోలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు సోమవారం అర్ధరాత్రి విధ్వంసం సృష్టించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లా అమబెడా సమీపాన ప్రధాన రహదారిని 130వ జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేసిన కేంద్రప్రభుత్వం నిర్మాణ పనుల కోసం రూ.200.67 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్డు పనులు చేపడుతుండగా, రహదారి వెంట జియో నెట్‌వర్క్ కంపెనీ ఫైబర్ కేబుల్ ఏర్పాటుచేస్తోంది. దీనిని వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు రహదారిపై కందకాలు తవ్వడంతో పాటు కేబుల్‌కు నిప్పంటించి దగ్ధం చేశారు. అలాగే, అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ప్రకటిస్తూ మావోయిస్టులు బ్యానర్లను ఏర్పాటు చేశారు.


వృద్ధుడి ఆత్మహత్య

పాల్వంచరూరల్: ఓ వృద్ధుడు మద్యానికి బానిసై, భార్యతో గొడవ పడి పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం కారెగట్టు గ్రామానికి చెందిన నలమాస వెంకటేశ్వర్లు(70) మద్యానికి బానిసయ్యాడు. ఎప్పుడూ భార్య మల్లమ్మతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం కూడా ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. ఆ తర్వాత పొలానికి వెళ్లిన వెంకటేశ్వర్లు అక్కడే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన పక్క పొలాల రైతులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ఇల్లెందు: ఇల్లెందు – బయ్యారం మండలాల సరిహద్దు వీరాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మంగళవారం మృతి చెందింది. సీఐ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం మిర్యాలపెంట పంచాయతీ సాంబతండాకు చెందిన గుగులోతు ఉమ(45) ఈనెల 24న ఆమె కమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో గాయపడిన ఉమకు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతి చెందింది.

గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

సుజాతనగర్: మండలంలోని సీతంపేట బంజరలో రైతు భూక్యా భద్రుకు చెందిన వరిగడ్డివాము దగ్ధమైంది. భద్రు రెండెకరాల్లో కోసిన వరిగడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేశాడు. అయితే, పైన ఉన్న విద్యుత్ తీగలు మంగళవారం చెట్టుకు తగిలి షార్ట్ సర్క్యూట్ కావడంతో గడ్డిపై నిప్పు రవ్వలు పడి దగ్ధమైంది. స్థానికులు చేరుకుని మంటలను అదుపు చేసినా సుమారు రూ.20 వేల విలువైన గడ్డి దగ్ధమైందని బాధితుడు తెలిపాడు.

గంజాయి రవాణా కేసులో జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: గంజాయి అక్రమంగా రవాణా చేస్తు పట్టుబడిన కేసులో హైదరాబాద్ వాసికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించారు. కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(స్పెషల్ జడ్జి ఫర్ ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ మంగళవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2018 అక్టోబర్ 28న అప్పటి భద్రాచలం సీఐ సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ వెళుతున్న విజయవాడ డిపో బస్సులో తనిఖీ చేయగా ఏడుగురు రూ.3.45లక్షల విలువైన 69 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. దీంతో పంచనామా అనంతరం ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా తుండపల్లి పంచాయతీకి చెందిన గోపాల్ మండల్, దీపాంకర్‌నామ, సంతోష్ సర్కార్, హైదరాబాద్‌కు చెందిన అలీఖాన్, రాజీవ్‌కుమార్ పటేల్, స్వామి సర్కార్, సోమాలిని రిమాండ్‌కు తరలించారు. అయితే, కేసు విచారణ సందర్భంగా హైదరాబాద్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన రాజీవ్‌కుమార్‌కు పటేల్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇక మిగిలిన ఆరుగురిపై వారెంట్ పెండింగ్‌లో ఉన్నందున చార్జ్‌షీట్ దాఖలుకు ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కుమ్మరి రామారావు వాదించగా, లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, భద్రాచలం టౌన్ ఏఎస్సై గంజి శేఖర్ సహకరించారు.

క్లుప్తంగా...


ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండాపాటలో పోటీ పడుతున్న వ్యాపారులు

మిర్చికి రికార్డు ధర

ఖమ్మం మార్కెట్‌లో 'తేజా'రకం క్వింటాకు రూ.21,625

ఖమ్మం వ్యవసాయం: తేజా రకం మిర్చికి రికార్డు స్థాయిలో ధర పలికింది. ఈ రకం మిర్చి క్వింటాకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం రూ.21,625గా ధర నమోదైంది. ప్రస్తుత సీజన్‌లో ఈ ధరే అత్యధికమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది అన్ సీజన్‌లో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి రూ.23 వేల వరకు ధర పలకగా, ప్రస్తుత సీజన్‌లో రైతు నేరుగా మార్కెట్‌లో పంట విక్రయిస్తున్న సమయంలో గరిష్ఠ ధర నమోదు కావడంతో హర్షం వ్యక్తమవుతోంది. తేజా రకం మిర్చి సాగు విస్తీర్ణం తెగుళ్ల బెడద కారణంగా గతేడాదితో పోలిస్తే తగ్గగా.. ఈసారి కూడా తెగుళ్ల కారణంగా దిగుబడులూ తగ్గాయి. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తేజా రకం మిర్చికి డిమాండ్ పెరగడంతో ధరకు రెక్కలొచ్చాయని విశ్లేషిస్తున్నారు. సోమవారం రూ.20,200 పలికిన ధర ఒకేరోజులో ఏకంగా రూ.1,425 పెరగడంతో రైతులు విక్రయానికి ముందుకొస్తున్నారు. కాగా, గరిష్ఠ ధర దక్కించుకున్న పలువురు రైతులను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం సత్కరించారు.

బీఆర్‌ఎస్ అండతోనే ఇసుక మాఫియా దాడి

సాక్షి, హైదరాబాద్: జనగాం జిల్లా యశ్వంతపూర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన ఆర్‌ఎంపీ శ్రీనివాస్‌పై అధికార పార్టీ నేతల అండతో ఇసుక మాఫియా దాడి చేయడాన్ని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఖండించారు. ఈ మొత్తం వ్యవహారంపై తగిన విచారణ జరిపి దోషులను అరెస్ట్ చేయాలని, శ్రీనివాస్‌కు తగిన భద్రత కల్పించాలని ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలున్నారనే ఉద్దేశంతో కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే తగిన కార్యాచరణతో ప్రభుత్వంపై పోరాటానికి బీజేపీ సిద్ధమౌతుందని ఆయన హెచ్చరించారు.



గూడు కోసం గుడిసెలు

ఇవేవో జాతరలో వేసిన గుడారాలు అనుకుంటే పొరపాటే. ఆదిలాబాద్ జిల్లాలో తొమ్మిది తెగలకు చెందిన ఆదివాసీలు న్యూ హౌసింగ్‌బోర్డు సమీపంలోని సర్వే నంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసి ఆక్రమించారు. తమకు ఇంటి హక్కు కల్పించాలని.. లేకుంటే ప్రాణాలు పోయినా కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

'బిందు'కు..బంద్!

కూరగాయలు, పండ్ల తోటలకు సబ్సిడీ నిలిపివేత

- లక్షకు పైగా రైతుల దరఖాస్తులు పక్కన పెట్టిన వైనం
- ఒక్క ఆయిల్‌పాం సాగుకే సబ్సిడీపై డ్రిప్ పరికరాలు
- సర్కారు నిర్ణయంతో రైతుల్లో ఆందోళన
- తమకూ ఇవ్వాలంటూ వినతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్)పై సందిగ్ధత నెలకొంది. కూరగాయలు, పండ్ల సాగులో డ్రిప్ పరికరాలకు ఇస్తున్న సబ్సిడీని ఉద్యానశాఖ నిలిపివేసింది. వివిధ పంటలకు చెందిన రైతులు డ్రిప్‌పై సబ్సిడీ కోరుతూ చేసుకున్న దరఖాస్తులను సైతం తిరస్కరించింది. ఇలా దాదాపు లక్షకు పైగా దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కాగా కేవలం ఆయిల్‌పాం సాగుకు మాత్రమే డ్రిప్ సబ్సిడీ నిధులను ఉద్యాన శాఖ బదిలీ చేసింది. దీంతో పండ్లు, కూరగాయల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రిప్‌ను సొంతగా ఏర్పాటు చేసుకోవడం అధిక వ్యయంతో కూడిన పని కావడం ఇందుకు కారణం. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా తమకు డ్రిప్ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ... కానీ..

ఉద్యాన పంటలను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది. తక్కువ నీటితో ఎక్కువ మొక్కలకు నీరు అందేందుకు అవకాశం ఉంటుంది. ఈ కారణంగానే డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తోంది. కానీ అకస్మాత్తుగా సబ్సిడీ నిలిపివేత నిర్ణయం తీసుకోవడంతో రైతులపై భారం పడనుంది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ (బిందు, తుంపర) సేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తుంది. బీసీ రైతులకు 90%, ఇతరులకు 80% వరకు సబ్సిడీ ఇస్తుంది. సాధారణంగా ఎకరానికి సూక్ష్మ సేద్యం ఏర్పాటు చేసుకోవాలంటే దాదాపు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇదే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ.300 కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే తాజాగా ఆయిల్‌పాం తప్ప మిగతా పంటలను ప్రభుత్వం పక్కన పెట్టింది.

పూర్తిగా సొంత డబ్బులతో కొనుక్కోవాల్సిందే..

ఏటా దాదాపు లక్ష ఎకరాల వరకు ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ కోసం సబ్సిడీ ఇస్తున్నారు. తాజాగా కూరగాయలు, మామిడి, జామ వంటి పండ్ల తోటలకు డ్రిప్ సబ్సిడీ ఎత్తి వేయడంతో ఆయా రైతులు ప్రైవేట్‌లో ఎకరానికి సొంతంగా రూ.40 వేల వరకు ఖర్చు చేసి పరికరాలు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇస్తుండగా సర్కారు తాజా నిర్ణయంతో వారు కూడా పూర్తి స్థాయిలో ఖర్చు చేసి కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల రైతులపై వందలాది కోట్ల రూపాయల భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆయిల్‌పాం డ్రిప్ సబ్సిడీకి నిధులేవీ?

గతేడాది వరకు 55 వేల ఎకరాలకే పరిమితమైన ఆయిల్‌పాం విస్తీర్ణాన్ని రానున్న రోజుల్లో ఏకంగా 20 లక్షల ఎకరాలకు పైగా విస్తరించాలని రాష్ట్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఆయిల్ ఫెడ్ పరిధిలోనే ఉన్న ఆయిల్‌పాంను కొత్తగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించింది. రాష్ట్రంలో 10 ప్రైవేట్ కంపెనీలకు వివిధ జిల్లాల్లో ఆయిల్‌పాం సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యత అప్పగించింది. ఆయిల్‌పాం సాగులో కీలకపాత్ర పోషించేది సూక్ష్మ సేద్యం పరికరాల ఏర్పాటే. కానీ ఆయిల్‌పాం సాగుకు అవసరమైన డ్రిప్ పరికరాల కోసం ప్రత్యేకంగా సబ్సిడీ సొమ్ము కేటాయించలేదు. ఈ కారణంగానే ఇతర పంటలకు ఇస్తున్న సబ్సిడీకి కోతపెట్టి కేవలం ఆయిల్‌పాంకే నిధులు కేటాయించింది. ఇది ఇతర పంటల రైతులను కలవరపరుస్తోంది.

సూక్ష్మ సేద్యంలో తెలంగాణ వెనుకబాటు

మైక్రో ఇరిగేషన్‌లో తెలంగాణ వెనుకబడి ఉందని లెక్కలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా 2.30 కోట్ల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అందుబాటులోకి వచ్చింది. కానీ తెలంగాణలో ఇది కేవలం 12 లక్షల ఎకరాల్లోపే ఉందని అంచనా. దేశంలో అత్యధికంగా రాజస్తాన్‌లో 44.71 లక్షల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత మహారాష్ట్రలో 35.31 లక్షల ఎకరాల్లో, గుజరాత్‌లో 28.45 లక్షల ఎకరాల్లో సాగవుతోంది.

43 శాతం నీరు ఆదా

డ్రిప్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేయడం వల్ల రాష్ట్రంలో 43 శాతం నీరు ఆదా అవుతుంది. ఇది 25 టీఎంసీల నీటికి సమానం. డ్రిప్ పథకాన్ని పంటల సాగుకు వాడడంతో 33 శాతం విద్యుత్ కూడా ఆదా అయినట్లేనని గతంలో న్యాబ్కాన్స్ సంస్థ చేసిన సర్వేలో తేలింది. అలాగే 52 శాతం దిగుబడి అదనంగా పెరిగినట్లు గుర్తించారు. ఎందుకంటే మొక్కకు అవసరమైన నీరు నేరుగా డ్రిప్ పైపుల ద్వారా వెళుతుంది. ఈ పరికరాల ద్వారా ఏడు సంవత్సరాల వరకు లబ్ధిపొందవచ్చు.

భద్రాద్రి రామయ్యకు 'సువర్ణ' వాహనాలు


భద్రాద్రి రామాలయానికి చేరుకున్న సువర్ణ హనుమత్ వాహనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ప్రవాసాంధ్ర ఆర్యవైశ్య అసోసియేషన్ వారు సువర్ణ తాపడ వాహనాలను వితరణగా అందజేశారు. రూ.75 లక్షల వ్యయంతో తమిళనాడులోని కుంభకోణంలో ఈ వాహనాలను తయారు చేయించారు. సార్వభౌమ, హనుమంత, కల్పవృక్ష, సింహాసన, హంస, సింహ, గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష వాహనాలకు బంగారు పూతతో తయారు చేయించిన ఈ వాహనాలు మంగళవారం సాయంత్రం భద్రాచలం చేరుకున్నాయి. స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చి వీటికి స్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. వీటికి గురు, శుక్రవారాల్లో ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. శనివారం సాయంత్రం సార్వభౌమ వాహన సేవ నిర్వహించనున్నారు.

పగిలిన ఎల్లంపల్లి పైప్‌లైన్

పంప్‌హౌస్‌లోకి చేరిన నీరు


పగిలిన పైప్‌లైన్ నుంచి వస్తున్న నీరు, గేట్‌వాల్ నుంచి వస్తున్న లీకేజీ నీరు

ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం రిజర్వాయర్ సమీపంలోని ఎల్లంపల్లి పంప్‌హౌస్ వద్ద మంగళవారం సాయంత్రం బటర్‌ఫ్లయ్ వాల్వ్‌లోని పైప్ పగిలిపోయింది. ఆ నీరంతా సమీపంలోని పంప్‌హౌస్‌లోకి చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఎత్తిపోతలను నిలిపివేశారు. జగిత్యాల జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు మంగళవారం ఉదయం 11 గంటలకు ఎల్లంపల్లి వద్ద ఒక మోటార్‌ను స్టార్ట్ చేశారు. ఒక మోటార్ 247 క్యూసెక్కులు ఎత్తిపోస్తుంది. ఇలా నాలుగు గంటలు సాఫీగా నడిచిన తర్వాత పంప్‌హౌస్ సమీపంలోని బటర్‌ఫ్లయ్ వాల్వ్ లోపలి పైప్ ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో నీరంతా పంప్‌హౌస్‌లోకి ప్రవహించింది. అధికారులు వెంటనే షట్టర్లను మూసివేసి మోటార్ పంప్‌లు మునిగిపోకుడా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ షట్టర్ సందుల్లోంచి.. కిటికీల ద్వారా నీరు లోపలికి చేరింది. నీటి ప్రవాహం పంప్‌హౌస్‌లోకి రాకుండా పగిలిన వాల్వ్ సమీపం నుంచి జేసీబీ సహాయంతో గండికొట్టి నీటిని తిరిగి రిజర్వాయర్‌లోకి మళ్లించారు. పగిలిపోయిన వాల్వ్ దగ్గర నుంచే జేసీబీతో పెద్ద కాలువలా తవ్వి నీటిని సమీపంలోని మేడారం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. నీటిని రిజర్వాయర్‌లోకి తరలించేందుకు వేసిన కట్ట ప్రవాహానికి కొట్టుకుపోతే తిరిగి పంప్‌హౌస్‌లోకి నీరు చేరే అవకాశముంది. మోటార్లను నిలిపివేసినప్పటికీ నారాయణపూర్ నుంచి నీరు రివర్స్ వస్తుండటంతో పగిలిపోయిన పైప్ ద్వారా నీరు పైకి వస్తోంది. ప్రస్తుతం ప్రవాహం కాస్త తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యం భోజనం

పౌరసరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి రోజు 35 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తోందని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా శివారెడ్డిపల్లిలోని మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ దేశంలో సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. తెలంగాణలో 28,632 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా 25 లక్షల మంది విద్యార్థులకు, అలాగే 4,237 ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని 9.65 లక్షల మంది విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఏడాదికి 1.50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. బియ్యం నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ భాస్కరరావు, మేనేజర్ అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

కేటీపీఎస్ కర్మాగారాలను సందర్శించిన స్పెషల్ సీఎస్


కర్మాగారంలో మొక్క నాటుతున్న సునీల్ శర్మ దంపతులు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ(ఎనర్జీ) సునీల్‌శర్మ మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయనకు కేటీపీఎస్ 5, 6, 7వ దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, ట్రెనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు, విద్యుత్ సౌధ సీజీఎం టీఎస్‌ఎన్.మూర్తి స్వాగతం పలికారు. అనంతరం యూనీబీ, బాయిలర్, వ్యాగన్ లిప్లర్, కోల్ ప్లాంట్లలో పర్యటించి ఉత్పత్తి ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. కాగా, కొత్తగూడెంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో చదువుకున్న సునీల్‌శర్మ రుద్రంపూర్ ధన్‌బాద్ ఏరియాతో ఉన్న అనుబంధాన్ని స్కూల్‌లో సహచరుడైన సీజీఎం మూర్తి తదితరులతో పంచుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఈలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో చిన్నారుల ప్రతిభ


చిన్నారులు, కోచ్‌తో డీవైఎస్ఓ పరంధామరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: ఏపీలోని విజయవాడ కృష్ణా నదిలో తాజాగా నిర్వహించిన ఈత పోటీల్లో ఖమ్మంకు చెందిన చిన్నారులు సత్తా సత్తా చాటారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న మోక్షు 1.25 కి.మీ. దూరాన్ని 23.50 నిమిషాల్లో పూర్తి చేయగా డి.అశ్విన్ 26.39, భగత్‌నాయక్ 28.40 నిమిషాల్లో పూర్తిచేయడం విశేషం. కాగా, జిల్లా స్విమ్మర్లను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్ కొండల్‌రావు మంగళవారం అభినందించారు.

2037 మందికి కొలువులు..


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, పక్కన జిల్లా ఉపాధి శాఖాధికారి విజేత తదితరులు


ఉద్యోగం సాధించిన యువతికి నియామకపత్రం అందిస్తున్న భద్రాద్రి కలెక్టర్ అనుదీప్

- 'గూడెం' జాబ్‌మేళాకు విశేష స్పందన
- 36 కంపెనీల భాగస్వామ్యం
- అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురి పిలుపు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాద్రి జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 36 కంపెనీలు ఈ మేళాలో భాగస్వామ్యం కాగా, వివిధ స్థాయిలలో 2,037 మంది కొలువులు సాధించారు. 5,200 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా ప్రతిభతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జాబ్‌మేళాను విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఉపాధి కల్పనాధికారిని అభినందించారు. అనంతరం నూతనంగా ఉద్యోగాలు సాధించిన వారిలో కొందరికి అపాయింట్‌మెంట్ ప్రతులు అందజేశారు. ఉపాధి కల్పన అధికారి విజేత మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 2,037 మందికి ఉద్యోగావకాశాలు లభించడం సంతోషంగా ఉందన్నారు. యువత ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి జాబ్‌మేళాలు మరిన్ని నిర్వహించి ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, పీఏసీఎస్ చైర్మన్ మండె వీరహనుమంతరావు, స్థానిక కౌన్సిలర్ కె ధర్మరాజు, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి తదితరులు మాట్లాడగా.. కౌన్సిలర్లు పల్లపు లక్ష్మణ్, రుక్మాంగధర్ బండారి, బీఆర్‌ఎస్ నాయకులు ఎంఏ రజాక్, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల కన్వీనర్ బడుగు ప్రభాకర్ పాల్గొన్నారు.

వివిధ కంపెనీల్లో ఉద్యోగాల వివరాలిలా..

ఎల్‌అండ్‌టీ 586, వైఎస్‌కే ఇన్ఫోటెక్ 132, వేవింగ్స్ మాన్‌పవర్ సొల్యూషన్స్ 46, ఆర్‌ఎస్ టెలీ సర్వీసెస్ 126, అపోలో ఫార్మసీ 30, ఎస్‌బీఐ కార్డ్స్ 30, టీంలీస్ సర్వీసెస్‌లో 46మందిని ఎంపిక చేశారు. అలాగే, హ్యాపీ మొబైల్స్ 42, ముత్తూట్ గ్రూప్ 43, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 24, టాటా స్ట్రైవ్ 18, ప్రీమియర్ హెల్త్ కేర్ సర్వీసెస్ 92, హెచ్‌ఐహెచ్‌ఆర్ సొల్యూషన్స్ 38, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ 24, శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్స్ 100, గూగుల్ పే 223, డీ మార్ట్ 16, ఏంజెల్ కన్సల్టింగ్ సర్వీసెస్ 38, టాటా స్కై 26, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 30, హెటిరో డ్రగ్స్ 42, బీబీజీ గ్రూప్ 43, ప్రథమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 140, ఎల్‌ఐసీ 78, ముత్తూట్ పెన్‌కార్న్ లిమిటెడ్ 30, ఇక్షానా ఇండియా లిమిటెడ్‌కు 194మంది ఎంపికయ్యారు.

చాలా సంతోషంగా ఉంది



ఇంటర్ చదివిన నాకు శ్రీ విజయ బయోఫెర్టిలైజర్‌లో ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు చేయూతగా ఉండే అవకాశాన్ని ఈ జాబ్ మేళా కల్పించింది. – బద్దె గీతామాధురి, సీఆర్‌పీ క్యాంప్

అందరికీ ధన్యవాదాలు



బ్యాంక్ జోన్‌లో ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. జాబ్‌మేళా నిర్వహించడం మా అదృష్టం. ఈ అవకాశం కల్పించిన అధికారులకు, ఉద్యోగం ఇచ్చిన యాజమాన్యానికి ధన్యవాదాలు.

\- సుకన్య నాగదుర్గ, రామవరం

అన్నిరంగాల్లో తొర్రూరు అభివృద్ధి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు వెల్లడించారు. పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో తొర్రూరు మున్సిపాలిటీ పాలకవర్గ ప్రతినిధులతో మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొర్రూరులో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు త్వరలో మంత్రి కేటీఆర్ వస్తారని తెలిపారు. రూ.100 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, ఎనిమిది జంక్షన్లు, మున్సిపాలిటీ భవన నిర్మాణం, చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి పర్చే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే, శాశ్వత తాగునీటి సరఫరా కోసం రూ.6.73కోట్లు, మిషన్ భగీరథ కనెక్షన్లకు రూ.5.77కోట్లు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.2.95 కోట్లు, డివైడర్లకు రూ.5కోట్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5.30 కోట్లు, యతిరాజారావు పార్కుకు రూ.6.18 కోట్లు, ట్యాంక్‌బండ్, బతుకమ్మ ఘాట్ కోసం రూ.4కోట్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం రూ.43.20 కోట్లు వెచ్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ సింగారపు కుమార్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగానే రాజ్యాంగ ఫలాలు


సభలో మాట్లాడుతున్న యాతాకుల భాస్కర్

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా నిర్దేశించిన ఫలాలు 75ఏళ్లు దాటినా అర్హులకు అందని ద్రాక్షగానే మిగిలాయని మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న దండోరా రాష్ట్ర మూడో మహాసభలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే మాదిగల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేదని తెలిపారు. అనంతరం దండోరా నూతన కమిటీలను ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా క్యాదాసి భాస్కర్‌మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడిగా కొంగరి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు కొరిపల్లి శ్రీనివాస్, రాజనర్సు, ఉపాధ్యక్షులుగా కూరం లింగయ్య, కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా సుధాకర్, సాల్మన్, కార్యదర్శులుగా కృష్ణబాబు, సైదులు, సహాయ కార్యదర్శులుగా రాజయ్య, విజయభాస్కర్, వి.శ్రీనివాస్, గోపాల్, యువసేన రాష్ట్ర కన్వీనర్‌గా గొల్లపల్లి నరేష్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కొరిపల్లి శ్రీనివాస్, వినయ్‌కుమార్, సురేందర్, శంకర్, బెల్లంకొండ శ్యామల, నరసయ్య, శోభ, ప్రసాద్, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

సహజ ఎరువుతో నేల, పంటకు మేలు


ఎరువుల తయారీ బెడ్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేటరూరల్: వానపాములతో తయారయ్యే సహజసిద్ధమైన ఎరువుతో నేలతో పాటు పంటలకు మేలు జరుగుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని నందిపాడులో మంగళవారం ఐసీఏఆర్ షెడ్యూల్ తెగల ఉప ప్రణాళిక లో భాగంగా 'వానపాముల ఎరువుల తయారీ–సాంకేతిక పరిజ్ఞానం' అంశంపై గిరిజన రైతులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ వానపాములతో ఎరువుల తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అలాగే, చిరు ధాన్యాల సాగు ఆవశ్యకతను వివరించారు. అనంతరం సర్పంచ్ వూకే వీరాస్వామికి ఆయిల్‌పామ్ హార్వెస్టర్, బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్, వర్మీ బెడ్స్, ట్రాక్టర్ మౌంటెన్ స్ప్రేయర్, రైతులకు మామిడి అంట్లు, వ్యవసాయ దిక్సూచి పుస్తకాలు అందజేశారు. ఎంపీటీ సీతారామరాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ సిద్దప్ప, రాంప్రసాద్, పావని, స్రవంతి, శిరీష, నాగాంజలి, ఏజీబీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ముగిసిన పోటీలు


పరుగుపందెలో పోటీ పడుతున్న విద్యార్థినులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లా పరిధిలోని కిన్నెరసాని, కాచనపల్లి మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు కిన్నెరసానిలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. మూడు రోజుల్లో 461 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకాగా ఎత్తు, బరువు, క్రీడా పోటీల్లో ప్రతిభను పరీక్షించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ఈనెల 18న తుది పరీక్షలు ఉంటాయని ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.చందు, పీడీ ఎస్.సుబ్రహ్మణ్యంతో పాటు ఎ.వెంకటేశ్వర్లు, నగేష్, బి.వెంకటేశ్వర్లు, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, రాంబాబు, నాగరాజు, వీరన్న, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మత్స్యశాఖ అధికారి బుచ్చిబాబు సస్పెన్షన్

వైరా: వైరా మత్స్యశాఖాధికారి బుచ్చిబాబును సస్పెండ్ చేస్తూ జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయస్వామి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజర్వాయర్‌లో చేపల వేట పొడిగింపునకు అనుమతి ఇవ్వాలని వైరా మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు షేక్ రహీమ్ గత ఏడాది జూలైలో కోరగా, అధికారులతో మాట్లాడి అనుమతి ఇప్పిస్తానని కాంట్రాక్ట్ ఉద్యోగి మురళి నమ్మబలికాడు. ఈమేరకు రహీం ఖాతా నుంచి మురళికి ఫోన్ పే ద్వారా రూ.50వేలు బదలాయించినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు గత ఏడాది డిసెంబర్ 23న మురళిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే, మురళి ఖాతా నుంచి నగదు బుచ్చిబాబుకు బదిలీ అయినట్లు తేలడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దీనికి తోడు బుచ్చిబాబుపై మరిన్ని అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను సస్పెండ్ చేయడమే కాక మురళిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.